అభివృద్ధి పనులకు నిధులివ్వండి

జడ్సీని కోరిన ఎమ్మెల్యే గాంధీ

కూకట్‌పల్లి జడ్సీ అభిలాష అభినవ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ. చిత్రంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, జూన్ 8: ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పెరుగుతున్న జనాభా నివాసాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగినన్ని నిధులను మంజూరు చేసి తోడ్పాటును అందించాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్‌లలో కొంతకాలంగా ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి జడ్సీ, ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్‌తో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నిధులను మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, కమ్యూనిటీ హాళ్లు సహా ఇతర మౌలిక వసతుల కల్పనను మరింతగా పెంచాలని, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై అధికారులతో తగు సమీక్ష నిర్వహించి జాప్యాన్ని నివారించేలా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరద నీరు సాఫీగా వెళ్లిపోయేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, నాలాలు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాల తొలగింపును పూర్తి చేయించాని ఎమ్మెల్యే గాంధీ కోరారు. నాలాలు, మ్యాన్‌హోళ్ల వద్ద ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలకు రహదారులు దెబ్బతినే అవకాశం ఉన్నందున తక్షణ మరమ్మతులను పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యల్లేకుండా చూడాలని ఎమ్మెల్యే గాంధీ జడ్సీ అభిలాషను కోరారు. కాగా, తన వినతి పట్ల జడ్సీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

బాలానగర్, జూన్ 8:పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్, తెలుగు పత్రికా రంగంలో దిగ్గజం, సామాజిక హితమే తమ హితమని భావించి ఈ ప్రపంచంలోనే తనకంటూ ప్రత్యేకత సంతరించుకున్న అక్షరయోధుడు, సంస్కారానికి సభ్యతకు చిరునామాగా నిలిచిన మహోన్నత వ్యకి చెరుకు రామోజీరావు స్వర్గస్తులయ్యారు. రామోజీరావు ఇక లేరు అని తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన భౌతికదేహానికి నివాళులర్పించారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రామోజీ మృతి పట్ల ఎమ్మెల్యే గాంధీ సంతాపం

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటన్నారు. అక్షరయోధుడిగా, పాత్రికేయానికి నిలువెత్తు నిదర్శనంగా రామోజీరావు నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. ఈనాడు పత్రిక ద్వారా ఎన్నో సామాజిక రాజకీయ అంశాలను ఎంతో నిబద్ధతతో వెలుగులోకి తీసుకువచ్చి విశ్వాసానికి మారుపేరుగా నిలిచారన్నారు. తను స్థాపించిన పలు సంస్థల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించిన మహనీయుడని, ఆయన ఆకస్మిక మృతి యావత్ దేశానికే తీరని లోటని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలుపడంతోపాటు వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే గాంధీ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

■ సుచిత్ర చైతన్య పాఠశాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న కుత్బుల్లాపూర్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జూన్ 8 : సుచిత్రలో ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న స్కూల్‌కు ఆనుకొని శ్రీచైతన్య స్కూల్ ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సూతనంగా ఏర్పాటు చేసే శ్రీచైతన్య స్కూల్ వలన ఇక్కడ ఇప్పటికే ఉన్న 40 బడ్జెట్ పాఠశాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి తోడు పాఠశాలకు ఆనుకొని ఉన్న సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌కు సమీపంలో విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేశారని వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జిల్లా విద్యాశాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడి సుచిత్ర శ్రీచైతన్య పాఠశాలకు అనుమతులు నిలిపివేయాలని, సమీపంలో ఎలాంటి అనుమతులు జారీ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల రిజిగ్నైజేషన్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మహేశ్ కుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్ పి.శివయ్య, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షులు వరప్రసాద్, సెయింట్ ఆంథోనీ హైస్కూల్ కరస్పాండెంట్ సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వంట సామగ్రి విరాళం

బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావులకు వంట సామగ్రిని అందజేస్తున్న హనుమాన్ భక్తులు

బాలానగర్, జూన్ 8 : కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ, శివాలయం అభివృద్ధికి హనుమాన్‌దీక్ష పట్టిన భక్తులు తమ వంతు విరాళంగా వంట సామగ్రిని అందించడం అభినందనీయమని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు అన్నారు. శనివారం రూ. 35,500 విలువ గల వంట సామగ్రిని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు సమక్షంలో 70 హనుమాన్ స్వాములు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల 41 రోజులపాటు హనుమాన్ దీక్షాధారణ చేసిన భక్తులకు నిత్య పూజలు చేసుకునేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసి సహకరించినందున హనుమాన్ భక్తులందరూ భాగస్వాములై వంట సామగ్రిని కొనుగోలు చేసి ఆలయ కమిటీకి అందజేయడం శుభదాయకమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత్‌రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భర్తతో విభేదం.. భార్య ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, జూన్8: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల మేరకు జగద్గిరిగుట్ట మైపమ్మనగర్‌లో కమ్మరి భవాని(32) నివాసముంటున్నది. పదేండ్ల కిందట వివాహం కాగా, భర్త భానుచందర్‌తో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు గమనించే సరికే చనిపోయింది. ఈమేరకు బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బీజేపీ ఎంపీలకు అభినందన

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుతో తెలంగాణ అభివృద్ధికి సహకారం అందుతుందని పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ పొత్తూరి శివాజీరాజు అన్నారు. ఢిల్లీలో మోదీ ప్రమాణస్వీకార నేపథ్యంలో ఎంపీలు కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావును శనివారం ఆయన కలిసి అభినందించారు. రాజిరెడ్డి, నానిరాజు, ప్రదీప్, రఘురామరాజు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్, జూన్ 8

బాలానగర్‌లో వ్యక్తి అదృశ్యం

నారాయణ(ఫైల్)

బాలానగర్, జూన్ 8 : పని కోసం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడలో నివాసముండే గంట నారాయణ(40) మేస్త్రీ పని చేసి కుటుంబసభ్యులను పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 3వ తేదీన పని కోసం వెళ్తున్నానని ఇంట్లో చెప్పిన నారాయణ ఉదయం 9 గంటలకు పని కోసం బయలుదేరి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు నారాయణ ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య భాగ్యమ్మ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్,జూన్8: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజును శనివారం పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రాజు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జూన్ 8 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన ప్రదర్శనల్లో పలువురు నృత్యకారులు సంప్రదాయ నృత్యరీతులతో అలరించారు. ప్రదర్శనల్లో మయూరి నృత్యాలయాల గురువులు శ్రీదేవి రాజనాల శిష్య బృందం నర్తించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు భామ ప్రవేశం, రుక్మిణి ప్రవేశం, కొలువైతివరంగశాయి, గణేశా పంచరత్న, అతినిరుపమా, బృందావన నిలయేహ్, నమశ్శివాయతేయ్, కృష్ణం కలయ సఖి, సంగీత సామ్రాజ్య, ఇదిగో భద్రాద్రి అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసిన బీఆర్ఎస్ నేతలు,కార్యకర్తలు

దుండిగల్, జూన్ 8: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు బీఆర్ఎస్, నేతలు, కార్యకర్తలతో పాటు దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు చెందిన ప్రజలు శనివారం శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

తల్లి కోపగించడంతో యువతి..

లావణ్య(ఫైల్)

నాగేశ్(ఫైల్)

దుండిగల్,జూన్8: తల్లి కోపగించడంతో ఓ యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని సూరారం విశ్వకర్మకాలనీకి చెందిన కుమారయ్య, శశికళ దంపతుల కూతురు లావణ్య(22) బీఈడీ చదువుతున్నది. ఈ క్రమంలో రెండురోజుల కిందట సాయంత్రం 6గంటల సమయంలో ఇంట్లో పని విషయమై లావణ్యను తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన లావణ్య కొద్దిసేపు తన ఇంటి మెట్లపై కూర్చున్నది. అనంతరం రాత్రి 7:30 గంటల సమయంలో బయటకు వచ్చిన తల్లి శశికళకు తన కూతురు లావణ్య కన్పించలేదు. ఆందోళనకు గురైన ఆమె విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి, బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో వ్యక్తి...

సూరారం కాలనీలోని సాయిబాబానగర్‌కు చెందిన టీ.నాగమణి, నాగేశ్(38) దంపతులు. వీరుద్దరు ప్రైవేట్ ఉద్యోగులే. ఈ నేపథ్యంలో గత నెల(మే)15వ తేదీన రోజుమాదిరిగానే ఇంట్లో నుంచి విధులకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన నాగేశ్ రాత్రి పొద్దుపోతున్నప్పటికీ ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన నాగమణి భర్త సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తుండగా అవతల గుర్తుతెలియని వ్యక్తి బూతులు తిడుతున్నాడు. అయితే గతంలోనూ నాగేశ్ ఇలాగే బయటకు వెళ్లి రెండు నెలలపాటు వేరే మహిళతో ఉన్నాడని, ప్రస్తుతం సైతం అలాగే ఉండి ఉండవచ్చునని నాగమణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరణమంటూ మొక్కిన ప్రతి ఒక్కరిని కాపాడే దేవుడు అయ్యప్ప

ఎమ్మెల్యే కేపీ వివేకానంద



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద తదితరులు

దుండిగల్, జూన్ 8: శరణమంటూ మొక్కిన ప్రతి ఒక్కరిని కాపాడే దేవుడు అయ్యప్ప అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 26వ డివిజన్ పరిధి, శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం అంగరంగం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిమాన్విత దైవం అయ్యప్ప స్వామిని కొలవడం ద్వారా ఆపదలు తొలగుతాయని, శరణమంటూ మొక్కిన ప్రతి ఒక్కరిని కాపాడే దైవం ఆ మణికంఠుడు అని అన్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, రాఘవేంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఏవీ ఉన్ని క్రిష్ణన్, నంబూద్రి మెల్సంతి, ఉంగరాలు శ్రీనివాస్, ఎన్.హరిబాబు, దీపక్, గురుస్వామి, ఇంద్రకుమార్ దేవ్ గ్రామ పెద్దలు కొలన్(లీడర్)నర్సింహారెడ్డి దంపతులు, సాయిలు యాదవ్, నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు (లాలు స్వామి), భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అస్తమా నివారణకు ఉచితంగా మందు పంపిణీ

మేడ్చల్ రూరల్, జూన్ 8:గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో అస్తమా వ్యాధి నివారణ ఆయుర్వేద ఔషధాన్ని పంపిణీ చేశారు. మృగశిర కార్తె సందర్భంగా శనివారం ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు సాయి కుమార్ బాబా ఆధ్వర్యంలో 480 మందికి ఆశ్రమ నిర్వాహకులు ఈ మందును ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రెజరర్ యశోదమ్మ, సేవకులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బోడుప్పల్, జూన్8:ఆదివారం నిర్వహించే గ్రూప్-1 పరీక్షా కేంద్రాలకు చెంగిచర్ల డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ కవిత తెలిపారు. 40మంది విద్యార్థులు ఒకే కాలనీ నుంచి బయలుదేరనున్నట్లయితే అక్కడికే బస్సును పంపిస్తామని ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న కళాకారులు

మాదాపూర్, జూన్ 8: కళాకారులు నృత్య ప్రదర్శనలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహిని అధ్యక్షురాలు, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సంస్కృతి ఆర్ట్ అకాడమీ గురువు తిరుగొప్పుల శ్వేత శిష్య బృందంచే సిరుల నవ్వులు వాడు, ఇందరికి అభయంభు, బ్రహ్మమొక్కటే అని మంత్రములు వంటి సంకీర్తనలకు దృతి, భవిష్య, నయని, హసిని, సాయి సమన్విత, సమీర, అన్వితలు సంయుక్తంగా కలిసి అన్నమయ్య కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తు శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం సంస్థ అధ్యక్షులు, డాక్టర్ శోభరాజు కళాకారులను శాలువా కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

అల్లాపూర్, జూన్ 8:అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. శనివారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అల్లాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 30 – 35 సంవత్సరాలు ఉంటాయని భావిస్తున్నారు. చుట్టుపక్కల పరిశీలించినా మృతురాలికి సంబంధించిన వివరాలు లభించలేదు. మృతురాలు అనారోగ్యంతో మృతి చెందిందా? లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉన్నది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్
AS No. 71 OF 2024
దిగువ వారి మధ్య:
ఎం. జశ్వంత్ రావు ...పిటిషనర్/క్లెయిమ్ పిటిషనర్
మరియు
జి. రాంలింగరాజు మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్/DHR's/JDR's
దిగువ వారికి,
1. శ్రీమతి వి. శాంత కుమారి భర్త లేటు వి.వి. శ్రీనివాస దేవరాజు, నివాసం: ఫ్లాట్ నం. 62, ఫ్లాట్ నం. 402, జ్యోతి మహల్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్. 2) ఎం. శ్రీనివాస్ రెడ్డి తండ్రి ఎం. వెంకట్ రెడ్డి, నివాసం : 941, EWSFKPHB కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్. 3) వి. రాజీవ్ వర్మ తండ్రి లేటు వి.వి. శ్రీనివాస దేవరాజు, నివాసం: ఫ్లాట్ నం. 205, విజ్ఞాన్ టవర్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్. 4) వి. లావణ్య తండ్రి లేటు వి.వి. శ్రీనివాస దేవరాజు, నివాసం: ఫ్లాట్ నం. 205, విజ్ఞాన్ టవర్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్.
... రెస్పాండెంట్ నం. 5 నుండి 9/జడ్జ్‌మెంట్ డెటార్స్/ ....రెస్పాండెంట్స్
రిజిస్టర్ పోస్ట్ ద్వారా అదేవిధంగా గౌరవనీయ న్యాయస్థానం ద్వారా మీకు నోటీసులు పంపినప్పటికీ, మీ అందరు నుండి గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని ఎటువంటి ప్రతినిధ్యము చూపలేదని గమనించగలరు. దానిరీత్యా అప్పీలెంట్/పిటిషనర్ ద్వారా గౌరవనీయ న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చినది ఏమనగా, మీరు ఉద్దేశపూర్వకంగా గౌరవనీయ న్యాయస్థానం సమక్షంలో హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. పిటిషనర్ అభ్యర్థన మేరకు మీ అందరికి పత్రిక ప్రకటన ద్వారా నోటీసు జారీచేసేందుకు 02.04.2024న గౌరవనీయ న్యాయస్థానం అనుమతి మంజూరు చేసినది మరియు ఆ విషయం 10.06.2024న తదుపరి విచారణకు వాయిదా వేయబడినది. కావున, ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా మీరు మీ యొక్క విషయం గురించి ప్రతివాదన చేయుటకు స్వయంగా కానీ లేదా మీ న్యాయవాది ద్వారా కానీ 10.06.2024న గౌరవనీయ న్యాయస్థానం సమక్షంలో హాజరుకావాలని కోరడమైనది. లేనిచో, గౌరవనీయ న్యాయస్థానం యోగ్యతపై సదరు విషయం గురించి విచారణ చేస్తుంది మరియు నివేదికలు ఆధారంగా తగిన ఉత్తర్వులు జారీచేయవచ్చు. అందువలన మీకు తెలియజేయడమైనది.
రాఘవన్ కె తలపాక, ఎస్.వి. దర్శన్ తాళ్ళపాక,
న్యాయవాదులు
ఫ్లాట్ నం. 1010, జూబ్లీ బాల్‌పార్క్ అపార్ట్‌మెంట్, రోడ్ నం.2, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500045, మొబైల్ నం. 9676475123 & 9502027459